సాక్షి మెదక్

శుక్రవారం । 3 । నవంబర్ । 2023

I



యాగం.. నిర్విఘ్నం

సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం రెండో రోజైన గురువారం అత్యంత వైభవంగా కొనసాగింది. యాగంలో కేసీఆర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– మర్కూక్ (గజ్వేల్)

సర్వం సిద్ధం

నేటి నుంచి నామినేషన్లు





మెదక్ ఆర్డీవో కార్యాలయం

ఎన్నికల్లో భాగంగా కీలక నామినేషన్ల ఘట్టం శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. ఇందు కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీవో కార్యాలయాల్లో అధి కారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గా లకు సంబంధించి ఇప్పటికే పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా, జోరుగా ప్రచా రాలు చేస్తున్నారు. నేటి నుంచి 10వ తేదీ వరకు మాత్రమే నామినేషన్ల గడువు ఉం డడంతో అభ్యర్థులు తమ నామినేష న్లను సమర్పించడానికి ముహూ ర్తాలు చూసుకుంటున్నారు.

–మెదక్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 10వ తేదీ వరకు స్వీకరణ
- చిన్న తప్పున్నా తిరస్కరణే..
- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు

జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గా ల్లోని ఆయా ఆర్డీవో కార్యాలయాల్లోనే నామినేష న్లను దాఖలాలు చేయాల్సి ఉంది. ఎన్నికల రిటర్నిం గ్ అధికారులుగా ఆర్డీవోలే వ్యవహరిస్తున్నారు. నామినేషన్ సమయంలో లోపలికి వెళ్లడానికి అభ్య ర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం కల్పిస్తామని అధికార యంత్రాంగం ఇప్పటికే స్పష్టం చేసింది. దరఖాస్తుల స్వీకరణ సెలవు రోజు లను మినహాయించి, పని దినాల్లో మాత్రమే స్వీక రించనున్నారు. ప్రతీరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరి స్తారు. కాగా, ఎన్నికల కమిషన్ నిబంధనలను అను సరించి ధ్రువ పత్రాలను సమర్పించాలని ఇప్పటికే అభ్యర్థులకు తెలియజేశారు. అభ్యర్థి అఫిడవిట్‌కు సంబంధించి ఆస్తులు, ఖర్చులు, అప్పులతోపాటు గతంలో ఏమైనా కేసులు ఉంటే వాటి తప్పకుండా పొందుపర్చాల్సి ఉంటుంది. తప్పుగా నింపితే అభ్యర్థి నామినేషన్ తిరస్కరిస్తారు. రిజర్వేషన్ల వారీగా నామినేషన్‌కు డబ్బు చెల్లించాలి.

ముహూర్తం చూసుకొని..

మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలుకు పండితుల వద్ద మంచి ముహూర్తాలు చూసుకుంటున్నారు. మెదక్ బీఆర్ ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి 6వ తేదీ లేదా 9న నామినేషన్ వేయనున్నట్లు తెలిసింది. అలాగే, కాం గ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ 9న, బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ 8న, నామినేషన్ వేస్తారని ఆయా పార్టీ నాయకులు చెబుతున్నారు. అలాగే నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి ఆఖరు రోజైనా 10న నామినేషన్ వేస్తారని పార్టీ వర్గీయులు చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్ 9న నామినేషన్ వేయనున్నట్లు తెలిసింది.

144 సెక్షన్ అమలు

నామినేషన్ల కేంద్ర నుంచి వంద మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ర్యాలీగా వచ్చే అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయాలకు వంద మీటర్ల దూరంలోనే ర్యాలీని ఆపేయాలి. తమ పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతి ఇస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నారు.

సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

నర్సాపూర్: ఎన్నికల్లో భాగంగా నామినేషన్ వేసే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు తమ కార్యాల యంలో ఉచితంగా అందజేస్తామని, ఎవరికైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామని, ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే వారికి టోకెన్లు ఇచ్చి అందరి నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. కార్యాల యానికి వంద మీటర్ల దూరంలో బ్యారికేడ్లు, స్టాపర్లు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాలు బిగించామని వివరించారు. సమావే శంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కమలాద్రి, డీఈఓ సహదేవ్‌లు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

నామినేషన్ల స్వీకరణతోపాటు ఎన్నికల నిర్వహ ణను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు చేపట్టాలని అదనపు కలెక్టర్ రమేశ్ ఆదే శించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివా సులు ఆర్డీవో ఆఫీసులో చేపట్టిన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఏర్పాట్లను శ్రీనివా సులు, బందోబస్తు వివరాలను తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి వివరించారు. ఆయన వెంట ఇతర అధికారులు కమలాద్రి, సహదేవ్, సీఐ షేక్ లాల్‌మధార్, ఎస్ఐ శివకుమార్ ఉన్నారు.



ఏర్పాట్లు వివరిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

మరో నలుగురికి లైన్‌క్లియర్



బాబు మోహన్
అందోల్



రాంచంద్ర రాజనర్సింహ
జహీరాబాద్



సంగప్ప
నారాయణఖేడ్



విజయ్‌కుమార్
మెదక్

- నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన బీజేపీ
- అందోల్ అభ్యర్థిగా బాబుమోహన్
- జహీరాబాద్ బరిలో రాంచంద్ర రాజనర్సింహ
- సంగప్పకు నారాయఖేడ్. మెదక్‌కు విజయ్‌కుమార్
- సంగారెడ్డిలో కొనసాగుతున్న ఉత్కంఠ

మెదక్: భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థుల మూడో జాబితాను గురువారం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 35 మందితో కూడిన ఈ జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. అందోల్ అభ్యర్థిగా మాజీ మంత్రి, హాస్యన టుడు బాబూమోహన్‌కు కేటాయి ంచింది. తొలి జాబితాలో ఆయనకు చోటు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దీంతో ఆయన తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయబోనని, ఆ పార్టీ తరుపున ప్రచారం కూడా చేయనని తేల్చి చెప్పారు. బాబూమోహన్‌ను బుజ్జగించిన అధి నాయకత్వం చివరికి ఆయనకే టిక్కెట్టు కేటా యించింది. ఆ స్థానానికి మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య కూడా టికెట్ ఆశించారు. అలాగే.. జహీరాబాద్ టికెట్‌ను రాంచంద్ర రాజనర్సిం హకు కేటాయించారు. ఈ టికెట్‌ను ఢిల్లీ వసంత్ ఆశించారు. నెల రోజుల క్రితం బీఆర్ఎస్‌లో చేరిన ఢిల్లీ వసంత్ ఆ పార్టీ టికెట్ దక్కకపోవడం తో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అయినా.. ఆ పార్టీ టికెట్ కూడా దక్క లేదు. దీంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసే యోచనలో వసంత్ ఉన్నట్లు తెలుస్తోంది. తాను ఢిల్లీలో ఉన్నానని, వచ్చాక భవిష్యత్ కార్యాచ రణను ప్రకటిస్తానని వసంత్ పేర్కొన్నారు. గతం లో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన రాంచందర్ రాజ నర్సింహ కూడా కొన్ని నెలల క్రితం బీజేపీలో చేరారు. కాగా, నారాయణఖేడ్ అభ్యర్థిత్వాన్ని జనవాడే సంగప్పకు ఖరారు చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి బీజేపీ టికెట్ ఆశించారు. సంగప్పకు తొలి జాబితాల్లో టికెట్ ఖరారవుతుందని భావించారు. అయితే.. మూడో జాబితాలో ఆయనకు టికెట్ కేటాయిం చారు. అలాగే.. మెదక్ బీజేపీ అభ్యర్థిగా నిజాం పేట్ జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. బీఆర్ఎస్ నుం చి జెడ్పీటీసీగా గెలుపొందిన విజయ్ కుమార్ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. విజయ్‌కుమార్ నిజాంపేట మండల కేంద్రంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మిం చారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూ నుంచి బ్యాచిలర్ డిగ్రీని పొందాడు. తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కొన్నేళ్లు యూఎస్ఏ న్యూజెర్సీలోని ఎన్ఆర్ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సీనియర్ సిస్టమ్స్ ఇంజనీర్‌గా పని చేశారు.

సంగారెడ్డిలో నువ్వా.. నేనా..!

సంగారెడ్డి నియోజకవర్గం టికెట్‌కు తీవ్ర పోటీ నెలకొంది. టికెట్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావుదేశ్‌పాండే, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు ఆశిస్తున్నారు. ఇద్దరూ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేప థ్యంలో ఈ స్థానం అభ్యర్థిని బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, సిద్ది పేట్ నియోజకవర్గాలకు కూడా అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. గత నెల 22న ప్రకటిం చిన తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలో నర్సా పూర్, పటాన్‌చెరు, గజ్వేల్, దుబ్బాక అభ్యర్థు లను ప్రకటించిన విషయం విదితమే. తాజాగా మరో నలుగురికి టికెట్‌ను ఖరారు చేసింది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లకు కంట్రోల్ రూం ఏర్పాటు



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో వరి ధాన్యం కొనుగో ళ్లలో ఎలాంటి సమస్యలొచ్చినా కంట్రోల్ రూం ద్వారా రైతులు పరిష్కరించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్‌లో అధికారులు అందుబాటులో ఉం టారని తెలిపారు. జిల్లా సహకార శాఖ, గ్రామీ ణాభివృద్ధి శాఖ, లారీ ట్రాన్స్‌పోర్ట్స్ సిబ్బంది వివరాలు కంట్రోల్‌రూంలో ఉంటాయన్నారు. రైతులు 92811 03685 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లయ్ మేనేజర్ హరికృ ష్ణ, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం నిల్వలపై సమాచారం ఇవ్వండి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి అబ్దుల్ రజాక్



మెదక్ కలెక్టరేట్: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా జిల్లాలో ఎక్కడైనా అక్ర మంగా మద్యం నిల్వలు ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి అబ్దుల్ రజాక్ తెలి పారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా మద్యం డం ప్‌లు, అక్రమ రవాణా జరిగితే జిల్లా కంట్రోల్ రూమ్ 9441 401 084 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2523 కు తెలియజేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఇప్పటి వరకు 210 కేసులు నమోదు చేసి, 60 మందిని అరెస్టు చేశామన్నారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హనుమంతపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై శివకు మార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమంతపూర్ గ్రామానికి చెం దిన గొల్ల కృష్ణ (51)కి చెందిన ఆవు, దూడ బుధవారం మేతకోసం వెళ్లాయి. రాత్రి అయి నా అవి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం కృష్ణ వెతకడానికి వెళ్లాడు. అప్పటికే ఎద్దు శ్రీరాములు అనే రైతు పొలం సమీపంలో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా అయ్యే త్రీఫేజ్ కరెంట్ లైన్ తీగ తెగిపడి ఉంది. అది చూసుకోకుండా అటుగా వెళ్లిన కృష్ణ తీగకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణా లు కోల్పోయాడు. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు కృష్ణ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతు డికి భార్య లలిత, కూతురు, ఇద్దరు కుమారు లు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

రామాయంపేట(మెదక్): ఉపాధ్యాయుల పెం డింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలం గాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలలు సందర్శించి విలేకరులతో మాట్లా డారు. అవసరాల కోసం ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నందున వెంటనే విడుదల చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతి పొంది డీఏలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో రామా యంపేట మండల అధ్యక్షుడు ఐరేని రవీంద ర్‌గౌడ్, ఎస్టీయూ జిల్లా నాయకులు నర్సింహా రావు, రషీద్, నాగేందర్, కిషన్, శ్రీనివాస్, శేఖర్, ఝాన్సిలింగాపూర్ ప్రధానోపాధ్యాయు లు శ్యామ్ సుందర్ చార్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అబద్ధాల ప్రచారం

మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ పార్టీది అబద్ధాల ప్రచారమని మంత్రి హరీశ్‌రావు విమర్శిం చారు. చేగుంట మండలంలోని వడియారం గ్రామంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొత్త ప్రభా కర్‌రెడ్డిపై కత్తితో దాడి అమానుషమని, ఇలాం టి ఘటన ఎప్పుడూ ఊహించలేదని అన్నారు. ఆయన కోలుకునే వరకు ప్రతీ కార్యకర్త ప్రభాక ర్‌రెడ్డిలా ప్రచారం చేయాలన్నారు. అబద్ధాల ప్రచారంతో కాంగ్రెస్ గెలవాలని చూస్తుండగా అన్ని తానే చేశానని చెప్పుకుంటూ రఘునంద న్‌రావు ప్రచారం చేసుకుంటున్నాడని ఆరోపిం చారు. గతంలో బీజేపీ అభ్యర్థి ఇచ్చిన హామీ లను ప్రజలకు గుర్తు చేసి, హామీలు అమలు చేయని వ్యక్తి దుబ్బాకకు అవసరమా అని ప్రశ్నించాలని సూచించారు. ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే గెలిస్తే అన్ని రకాల అభివృద్ధి పనులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కనీసం నామినేషన్ కూడా వేసే స్థితిలో లేని ప్రభాకర్‌రె డ్డికి మద్దతుగా ఉండి బీఆర్ఎస్‌ను గెలిపించుకో వాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రావు, వెంకటనర్సింహారెడ్డి, రొట్టె రాజమౌళి, మామి డి మోహన్‌రెడ్డి, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచి కట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్, నారా యణరెడ్డి, రాజిరెడ్డి, రణం శ్రీనివాస్‌తోపాటు నియోజకవర్గంలోని పలు మండలాల ఎంపీటీ సీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు, బూత్‌కమిటీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కళాజాతతో విస్తృతస్థాయి ప్రచారం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- సీ–విజిల్ ఫిర్యాదులో తొమ్మిది కేసులు
- ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: స్వీప్ ద్వారా రెండు నియోజకవ ర్గాల్లో కళాజాత బృందాలు ఓటు హక్కు వినియో గంపై విస్తృతస్థాయి ప్రచారం చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణీప్రియద ర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సమా వేశం నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడు తూ.. మెదక్ నియోజక వర్గంలో మొత్తం 2,15,043 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో మహిళలు 1,12,218, పురు షులు 1,02,820, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,21,972, అందులో మహిళలు 1,13,551, పురుషులు 1,08,414, థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని మాట్లాడుతూ.. ఎంసీసీ ద్వారా 30 ఫిర్యాదులు, సీ–విజిల్ ద్వారా 22 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. తొమ్మిది ఫిర్యా దులకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. జిల్లాలో 27,690 లీటర్ల మద్యం సీజ్ చేశామని, అలాగే ఫ్లయింగ్ సర్వేయర్ టీమ్ ద్వారా రూ.12,01,920, పోలీస్ తనిఖీల ద్వారా రూ.1, 31,63,647 మొత్తం రూ.1,41,09,480లు సీజ్ చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు డోర్ టు డోర్ ప్రచారం, హెలికా ప్టర్, హెలీప్యాడ్, పార్టీ ఆఫీస్, స్ట్రీట్ కార్నర్ మీటిం గ్ ర్యాలీ, పలు రకాల పర్మిషన్లు మొత్తం 110 వచ్చాయని, అందులో 48 అనుమతి, మరో 12 అనుమతి నిరాకరించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వివరాలు కేవైసీ (నౌ యువర్ క్యాండెడ్ యాప్) ద్వారా తెలుసుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు కలిసి కేవైసీ పోస్టర్ ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్, అంబదాస్ రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, తదిత రులు పాల్గొన్నారు.

జిల్లాలో కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు

కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన వ్యయ పరిశీలకుడు, ప్రత్యేక అధికారి సం జయ్ కుమార్ గురువారం జిల్లాకు చేరుకు న్నారు. ఆయనకు కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని పుష్పగుచ్ఛంతో స్వాగ తం పలికారు. ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణ కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల అధికారి కృ ష్ణమూర్తి, ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్, తహ సీల్దార్ శ్రీనివాస్ ఎన్నికల సిబ్బంది, తదిత రులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై మాక్ పోలింగ్

డీఈఓ రాధాకిషన్



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): ఓటుహక్కుపై విద్యార్థు లకు అవగాహన కల్పించడం కోసమే పాఠశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ అన్నారు. గురువారం పేట మండలం సూరారం జెడ్పీపాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈవీ ఎంల పనితీరు, బ్యాలెట్ వినియోగం, పోలింగ్ నిర్వహణ, ఓటర్ స్లిప్స్ తదితర అంశాలపై అవగా హన కల్పించడంతోపాటు ఓటు హక్కును వినియో గించుకునేలా చూశారు.అనంతరం పాఠశాల ఆవర ణలో నిర్మిస్తున్న మన బడి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే, శాలిపేట జెడ్పీపాఠశాలలో కూడా మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమం లో జెడ్పీపాఠశాల హెచ్ఎం సాయిరెడ్డి, ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్ టీచర్ కే.రవి, ఉపాధ్యాయులు వెం కయ్య, రమేశ్, మనీష్‌రెడ్డి, జయశ్రీ, ఆసీఫ్, శాలిపేట హెచ్ఎం గొండస్వామి, ఉపాధ్యాయులు క్రిష్ణాగౌడ్, విమల, యాదగిరి పాల్గొన్నారు.

మైనంపల్లి హయాంలోనే అభివృద్ధి

కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి రోహిత్



అక్కన్నపేటలో మాట్లాడుతున్న రోహిత్

నిజాంపేట/రామాయంపేట(మెదక్): మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధే తప్ప, మళ్లీ జరగలేదని మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ అన్నారు. గురు వారం రామాయంపేట మండల పరిధిలోని అక్క న్నపేట, ఝాన్సిలింగాపూర్, కాట్రియాల్, లక్ష్మాపూ ర్, దంతెపల్లితోపాటు పలు గిరిజన తండాల్లో ఎన్ని కల ప్రచారం నిర్వహించారు.

‘అవ్వా ఓటు నాకే వేయాలి’

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



వృద్ధురాలిని ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని తమ్మాయిపల్లి, అర్కెల, నార్సింగి, సీతానగర్, బాచారం, ఎంకెపల్లి, చిత్రియాల్, గాజులగూ డెం, కొడుపాక గ్రామాల్లో గురువారం మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కొత్త పల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలను, వృద్ధులను ఆప్యా యంగా పలకరిస్తూ కారు గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోములు, పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

పార్టీ నర్సాపూర్ అభ్యర్థి సునీత రెడ్డి



పైతర సర్పంచ్‌కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సునీ తాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొంగోడ్, నాయిని జలాల్ పూర్, పోతిరెడ్డిపల్లి, అం సాన్ పల్లి, వసురాం తండా, వెంకటాపూర్, పోతం శెట్టిపల్లి, అప్పాజిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల, వైస్ ఎంపీపీ మల్లారెడ్డి, డీసీ ఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు మంజుల, కిష్టయ్య, శ్రీనివాస్, నాగరాణి, ఝాన్సీ లక్ష్మి, ఎనగండ్ల సర్పంచ్ వీరా రెడ్డి, ఎంపీటీసీ ఉదయ, భాగ్యలక్ష్మి, కొడిపల్లి ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు సంతోష్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వేమారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వెంకట్ గౌడ్, రాజా గౌడ్, చిన్న రాములు,తదితరులు పాల్గొన్నారు. అలాగే, పైతర గ్రామ సర్పంచ్ సంతోషతోపాటు ఆ పార్టీకి చెందిన 29 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రవితేజ రెడ్డి, ఎంపీటీసీ ఎల్లయ్య, మురళీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయం

వెల్దుర్తి(తూప్రాన్): బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజ లకు పూర్తి విశ్వాసముందని, రానున్న ఎన్నికల్లో కేసీ ఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురు వారం వెల్దుర్తిలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీ తారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమ న్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ క్రిష్టాగౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు తది తరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతను మోసగించిన సర్కార్‌



పార్టీలో చేరిన యువకులతో రాజిరెడ్డి

నర్సాపూర్‌: యువకులు కాంగ్రెస్‌ వైపు చూస్తున్నారని ఆ పార్టీ నర్సాపూర్‌ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఆయన సమక్షంలో మాసాయిపేటకు చెందిన పలువురు యువకులు హస్తం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువకులను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మోసం చేసినందున తమ పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఇతర నాయకులు నాగరాజు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువాలు కప్పుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్‌: మండలంలోని లింగాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరమేశ్వర్‌, సత్యపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, సతీష్‌, హన్మాండ్లు, మాణిక్యం, వడ్ల అంజయ్య, నారలక్ష్మణ్‌, వెంగప్ప, నారప్ప, వీర్శ, తుకారాం, సాయిలు, నర్సింహులు, రాములు, విఠల్‌, వెంకయ్య, షకీల్‌, షాదుల్‌, గంజాయిరాజు, నర్సమ్మ, వడ్డె రాజు, యాదుల్‌ పాల్గొన్నారు.

అవినీతిమయంగా బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీజేపీలో చేరిన గుడికందుల గ్రామ యువకులు

తొగుట(దుబ్బాక): బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు అవినీతిమయంగా మారాయని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన యువకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని తెలిపారు. తన గెలుపు కోసం యువత సైనికుల్లా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



బజ్జీలు తింటూ మహిళతో మాట్లాడుతున్న మురళీ యాదవ్‌

ఓటేస్తే.. గుడిసెను మిద్దె చేస్త

కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని సీతారాం తండాలో నర్సాపూర్‌ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ యాదవ్‌ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికంగా బజ్జీలు వేస్తున్న గిరిజన మహిళ వద్దకు వెళ్లి బజ్జీలు తీసుకుని తిన్నారు. గుడిసెలో ఉంటున్న ఆమెను చూసి.. ఇంకెన్నాళ్లు ఇందులో ఉంటావు, బీజేపీకి ఓటు వేస్తే ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన కింద మిద్దె కట్టిస్తానని హామీ ఇచ్చారు.



యువకుడికి కటింగ్‌ చేస్తున్న బీఎంపీ అభ్యర్థి ప్రకాష్‌ రాథోడ్‌

కటింగ్‌ చేస్తా.. ఓటేస్తావా తమ్మీ

నారాయణఖేడ్‌: బీఎంపీ అభ్యర్థి ప్రకాష్‌ రాథోడ్‌ వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని హంగిర్గా(బి) గ్రామంతోపాటు, గిరిజన తండాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హంగిర్గా(బి)లోని ఓ కటింగ్‌ షాపులో యువకుడికి కటింగ్‌ చేస్తూ తనకే ఓటేయాలి తమ్మీ అంటూ.. ప్రకాష్‌ కోరారు. కార్యక్రమంలో సురేష్‌, వినోద్‌, రవి, రాజు, శ్రీనివాస్‌, శివాజీ ఉన్నారు.



సునీత రెడ్డితో మాట్లాడుతున్న వృద్ధురాలు

అవ్వతో హామీ తీసుకుంటూ..


కొల్చారం(నర్సాపూర్‌): మండలంలోని కొంగోడ్‌ గ్రామంలో బీఆర్‌ఎస్‌ నర్సాపూర్‌ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతరెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లింది. ఆమె సునీత రెడ్డిని దగ్గరకు తీసుకుని చెవిలో గుసగుసలాడింది. నా ఓటు నీకే వేస్త.. ఏం ఫికర్‌ చేయకు అని చెప్పినట్లు కనిపించింది.

ప్రచార జోరు

స్పీడు పెంచిన బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు

● ఇంకా ప్రారంభించని బీజేపీ ● చాపకింద నీరులా బీఎస్పీ





జోగిపేట (అందోల్‌): అందోల్‌ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించే పనిలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఆ పార్టీల అభ్యర్థులు క్రాంతికిరణ్‌, దామోదర రాజనర్సింహ స్వయంగా ప్రచారాన్ని చేపడుతున్నారు. నియోజకవర్గంలో అందోల్‌, పుల్కల్‌, అల్లాదుర్గం, రేగోడ్‌, చౌటకూరు, వట్‌పల్లి, టేక్మాల్‌, మునిపల్లి, రాయికోడ్‌ మండలాలున్నాయి. అందోల్‌, చౌటకూరు, వట్‌పల్లి మండలాల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి దామోదర ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టగా, టేక్మాల్‌, రాయికోడ్‌ మండలాల్లో క్రాంతికిరణ్‌ ప్రచారాన్ని ప్రారంభించారు. ఊరికి ఇద్దరు కాంగ్రెస్‌ ముఖ్య నాయకులు అందోల్‌ మండలంలో ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. గ్రామాల్లో అభ్యర్థులకు ప్రజలు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలుకుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కరపత్రాలను పంచిపెడుతున్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇరు పార్టీలు కూడా యువతపైనే దృష్టిపెట్టారు.

మేనిఫెస్టోల పైనే ఆశలు

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లు ప్రకటించిన మేనిఫెస్టోలపైనే పార్టీ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. ఇరు పార్టీలు కూడా లక్షల సంఖ్యలో మేనిఫెస్టో కరపత్రాలను ముద్రించి ఇంటింటికీ పంచిపెడుతున్నారు. వాటి గురించి ప్రజలకు వివరిస్తున్నారు. క్రాంతికిరణ్‌ కరపత్రాలను పంపిణీ చేస్తూ వృద్ధులు, మహిళలతో ఫొటోలు దిగుతున్నారు. దామోదర ఈ సారి ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని చేస్తున్నారు. అనంతరం మహిళలు, రైతులు, యువకులను ఒకచోట కూర్చోబెట్టి ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని మాట తీసుకుంటున్నారు.

ఇంకా మొదలు పెట్టని బీజేపీ

నియోజకవర్గంలో బీజేపీ ఇంకా ప్రచారానికి శ్రీకారం చుట్టలేదు. గురువారం బాబుమోహన్‌ను అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించింది. అయితే తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయనని గతంలోనే బాబుమోహన్‌ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. అయినా ఆయనకే టికెట్‌ ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అందోల్‌ టికెట్‌ను బాబూమోహన్‌ తనయుడు ఉదయ్‌భాస్కర్‌, మాజీ జెడ్పీ చైర్మన్‌ బాలయ్యలు ఆశించారు. కానీ బాబుమోహన్‌ టికెట్‌ ఇచ్చారు. దీనికి సమ్మతించి బరిలో ఉంటారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రచారంలో బీజేపీ వెనుకబడటంతో ఆ పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

స్థానిక నినాదంతో..

నియోజకవర్గంలో బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా ముప్పారం ప్రకాశం పోటీలో ఉన్నారు. ఆ పార్టీ చీఫ్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌ అందరి కంటే ముందే అభ్యర్థిని ప్రకటించారు. దీంతో ప్రకాశం ముందస్తుగా ప్రచారాన్ని ప్రారంభించారు. తానే అసలైన స్థానికుడినని, నియోజకవర్గంలోనే పుట్టి పెరిగి చదువుకున్నానని ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక నినాదాన్ని గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

● కేసీఆర్‌ పాలనలో ఉజ్వల భవిష్యత్‌

జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ



ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేసీఆర్‌ పాలనలో ప్రజలకు ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో తురక కాశ కులస్తులు, రామన్నపల్లి గ్రామస్తులు మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సిద్దిపేటను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం, సర్పంచ్‌లు సుభాష్‌, ఉమేష్‌ చంద్ర, ఎంపీటీసీలు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

● భూ సమస్య పరిష్కరిస్తే ఓటేస్తాం..



అంతాయిగూడలో మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): కారు గుర్తుకే ఓటేస్తాం.. మా ఊరి భూ సమస్య పరిష్కరించాలని అంతాయిగూడ గ్రామస్తులు గురువారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత భూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మునిగడప గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్‌ రంగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్‌, కొండపోచమ్మ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌, కావ్య, శ్రీనివాస్‌గౌడ్‌, సత్యం, బాలలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌తో అభివృద్ధి

జనగామ బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి



అయినాపూర్‌లో మాట్లాడుతున్న దశమంత రెడ్డి

కొముురవెల్లి(సిద్దిపేట): డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జనగామ బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. గురువారం కొముురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని మండలంలోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాష్ట్రంలో కూడా ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే జనగామ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్‌, రాష్ట్ర నాయకుడు చక్రధర్‌, రాష్ట్ర మహిళ మోర్చా సభ్యురాలు తోకల ఉమారాణి, లక్ష్మారెడ్డి, దండ్యాల వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌గౌడ్‌, మహేందర్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌, బీజేపీలకు ఓటేస్తే మళ్లీ కరువే

ఎఫ్‌డీసీ చైర్మన్‌ చిట్టి దేవేందర్‌రెడ్డి



అంకిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్‌): ప్రజల కష్టాలను దూరం చేసిన సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి, బందారం, దర్గా, రాంపల్లి, మర్పడ్గ, ఖమ్మంపల్లి, నాగిరెడ్డిపల్లి, సిర్సనగండ్ల, గిరాయిపల్లి గ్రామాల్లో కేసీఆర్‌ విజయం కోసం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌ షోలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌, బీజేపీలకు ఓటేస్తే మునుపటి కరువు తప్పదన్నారు. కాంగ్రెస్‌ హయాంలో రైతాంగం తీవ్ర ఇబ్బంది పడిందని తెలిపారు. కుల మతాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్‌, జాగృతి గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడి అనంతుల ప్రశాంత్‌, నూనె కుమార్‌, బడేకోలు లావణ్య, శ్రీనివాస్‌, రజిత, లత, సంజీవరెడ్డి, ఎంపీటీసీలు పత్తి ఆంజనేయులు, ర్యాగల్ల దుర్గయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ప్రతిపక్షాలకు దడ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో పార్టీలో చేరికల కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ సీనియర్‌ నాయకుడు రాంభూపాల్‌ రెడ్డి తన అనుచరులతో కలిసి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా తెలంగాణలో జరగని అభివృద్ధి కేసీఆర్‌ 10 ఏళ్లలో చేసి చూపించారని తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు డిపాజిట్‌ల కోసం పోరాటం చేయాలని సూచించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి వారికి దడ పుడుతుందన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస్‌ నగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్‌, సింధు ఆదర్శ్‌ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్యాయం

అల్లాదుర్గం(మెదక్‌): బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోఆర్డినేటర్‌ షేక్‌ జలీల్‌ అన్నారు. గురువారం అల్లాదుర్గంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్‌ ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్‌ 9 ఏళ్లుగా పట్టించుకోవడం లేదన్నారు. మైనార్టీ కార్పొరేషన్‌ లోన్స్‌ గ్రామానికి ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్‌ఆర్‌ ప్రభుత్వం హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్‌ కల్పించారని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేయొద్దు : సీపీ

సిద్దిపేటకమాన్‌: సోషల్‌ మీడియాలో రెచ్చగొట్టే విధంగా తప్పుడు పోస్టులు చేయకూడదని సీపీ ఎన్‌.శ్వేత తెలిపారు. కమిషనరేట్‌ పరిధిలో ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఐటీ చట్టం ప్రకారం 21 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎన్నికల కిట్‌లు వచ్చేశాయ్‌



2023 అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా అధికారులకు అందించే కిట్‌లు గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. జిల్లా సమీకృత కార్యాలయంలో వాటిని భద్రపరిచారు.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట

● కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



మద్దూరులో ప్రచారం చేస్తున్న కొమ్మూరి అరుణ

మద్దూరు(హుస్నాబాద్‌): జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి అరుణ ధీమా వ్యక్తం చేశారు. గురువారం దూల్మిట్ట, మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకుల మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారికి ఓట్లతో తగ్గిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానికుడైన ప్రతాప్‌రెడ్డికి పట్టం కట్టాలని.. మన ప్రాంతం కాని పల్లాకు ఓటమి రుచి చూపించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ కామిడి జీవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భద్రప్ప, రాములు, సత్తయ్య పాల్గొన్నారు.

రఘునందన్‌ రావుకు గుణపాఠం తప్పదు



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో చెరుకు శ్రీనివాస్‌ రెడ్డి

దుబ్బాక: దుబ్బాకలో కాంగ్రెస్‌ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్‌ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 17వ వార్డు, మండల పరిధిలోని రాజక్కపేటకు చెందిన సుమారు 100మంది మహిళలు, బీఆర్‌ఎస్‌, బీజేపీ పార్టీలను వీడి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధి కేవలం దివంగత ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి హయాంలో మాత్రమే జరిగిందన్నారు. అమలుకు నోచని హామీలతో ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌ రావు దుబ్బాకకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగుచెందారన్నారు. కార్యక్రమంలో రవి, యేసురెడ్డి తదితరులున్నారు.

జహీరాబాద్‌ బీజేపీ అభ్యర్థిగా రాంచందర్‌

ఢిల్లీ వసంత్‌కు నిరాశే

బయోడేటా

నియోజకవర్గం	:	జహీరాబాద్‌
పేరు	:	సి.రాంచందర్‌ రాజనర్సింహ
పుట్టినతేది	:	24-04-1969
విద్యార్హత	:	డిగ్రీ
తండ్రి	:	రాజనర్సింహ
తల్లి	:	జనాబాయి
భార్య	:	సుమిత్ర
కుమార్తెలు	:	స్నేహ, శ్రేయ

జహీరాబాద్‌: జహీరాబాద్‌ అసెంబ్లీ(ఎస్సీ) నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా రాంచందర్‌ రాజనర్సింహ పేరును గురువారం అధిష్టానం ప్రకటించింది. టికెట్‌ రేసులో సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్‌ పేరు ముందున్నా చివరకు రాజనర్సింహ వైపే మొగ్గు చూపింది. అలాగే చింతలగట్టు సుధీర్‌కుమార్‌ సైతం టికెట్‌ ఆశించారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్‌ రాజనర్సింహకు రాంచందర్‌ స్వయాన సోదరుడు. గతేడాది కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు.

ఖేడ్‌ అభ్యర్థిగా జన్‌వాడే సంగప్ప

బయోడేటా..

పేరు: జన్‌వాడే సంగప్ప, తండ్రి: కంటెప్ప, తల్లి: శాంతమ్మ

పుట్టిన తేదీ: 06-06-1976

జన్మస్థలం: గ్రామం చౌకాన్‌పల్లి

మండలం: కంగ్టి, జిల్లా సంగారెడ్డి

సామాజిక వర్గం: లింగాయత్‌ (బీసీ)

విద్యార్హత: 7వ తరగతి వరకు జెడ్పీ పాఠశాల కంగ్టి, 8 నుంచి 10వ తరగతి వరకు జెడ్పీహెచ్‌ఎస్‌ నిజాంపేట్‌, ఇంటర్మీడియెట్‌ వీఎస్‌ఎస్‌ జూనియర్‌ కళాశాల సిద్దిపేట, బీఏ ఉస్మానియా యూనివర్సిటీ, బీసీజే, ఎంసీజే కాకతీయ విశ్వవిద్యాలయం.

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా జన్‌వాడే సంగప్ప పేరును గురువారం అధిష్టానం ప్రకటించింది. పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి పోటీపడ్డారు. కంగ్టి మండలం చౌకాన్‌పల్లికి చెందిన సంగప్ప లింగాయత్‌ బీసీ కులానికి చెందినవారు. జర్నలిస్టుగా రెండు దశాబ్దాలపాటు మీడియా సంస్థల్లో పనిచేశారు. 2021 జనవరి 1న బండి సంజయ్‌ నేతృత్వంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాటం చేశారు.

అందోల్‌ అభ్యర్థిగా బాబుమోహన్‌

బయోడేటా

పేరు: పల్లి బాబుమోహన్‌

తల్లిదండ్రులు: ఆనంద్‌రావు, పేరమ్మ

స్వస్థలం: బీరోలు(ఖమ్మం)

స్థిర నివాసం: హైదరాబాద్‌

విద్యార్హత: డిగ్రీ

జననం: 14 ఏప్రిల్‌, 1948

పదవులు: 1998 (ఉప ఎన్నిక), 1999, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక. 1998, 99 టీడీపీ నుంచి గెలిచి కార్మిక శాఖ మంత్రిగా సేవలందించారు. 2014లో టీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 2018లో బీజేపీలో చేరారు.

వృత్తి: సినీ నటుడు, రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా సేవలు

కుమారుడు: ఉదయ్‌భాస్కర్‌, భార్య: విజయలక్ష్మి